క్లుప్తంగా

కమాండెంట్‌కు ఎంపీడీఓ అభినందనలు



కమాండెంట్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ

కాకినాడ రూరల్: రమణయ్యపేట గ్రామంలోని కాకినాడ ఏపీఎస్పీ మూడో బెటాలియన్‌కు ఇటీవల కమాండెంట్‌గా వచ్చిన ఎం.నాగేంద్రరావును ఎంపీడీఓ పి.సతీష్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రమణయ్యపేట పంచాయతీ ప్రత్యేకాధికారి హోదాలో కమాండెంట్‌గా వచ్చిన నాగేంద్రరావుకు అభినందనలు తెలిపారు. ఆయనతో పాటు, పంచాయతీ కార్యదర్శి జొన్నాడ నరసింహారావు ఉన్నారు.

డాక్టర్ అడ్డాలకు జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

బోట్‌క్లబ్: వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్న కాకినాడకు చెందిన దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణకు చెన్నై ట్రేడ్ సెంటర్‌లో సోమవారం జరిగిన జాతీయ దంత వైద్యుల సదస్సులో జాతీయ స్థాయి ఉత్తమ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కాకినాడ అధ్యక్షుడు వీవీ రావు మాట్లాడుతూ, కాకినాడలో దాదాపు రెండున్నర దశాబ్దాలుగా దంత వైద్యంతో పాటు, ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన డాక్టర్ అడ్డాలకు ఈ పురస్కారం లభించటం ఆనందంగా ఉందన్నారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవ కార్యదర్శి అడ్డాల సత్యనారాయణ అందుకున్న రెండో జాతీయ పురస్కారమని చెప్పారు. గౌరవ కార్యదర్శి చిట్ల కిరణ్ మాట్లాడుతూ, ఇటువంటి పురస్కారాలను డాక్టర్ అడ్డాల మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు. జాతీయ పురస్కారం లభించటం చాలా ఆనందంగా ఉందని డాక్టర్ అడ్డాల పేర్కొన్నారు.

అర్చకులపై దాడులు అరికట్టాలి

బోట్‌క్లబ్: ఆలయ అర్చకులపై దాడులు చాలా బాధాకరమని భోగి గణపతి పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని ఆయన ఖండించారు. మతోన్మాదం, మతాల్లో వర్గ ఉన్మాదం, ఆధ్యాత్మిక ప్రగతికి, సమాజ హితానికి మేలు చేయవన్నారు. మతం ఏదైనా ఉన్మాదం సరికాదన్నారు. దాడుల సంస్కృతి తగదన్నారు. అర్చకుల రక్షణ బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నాగబాబుకు డీఎంహెచ్ఓ అభినందనలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాజస్థాన్‌లోని అల్వార్ నగరంలో ఈ నెల 6 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 44వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ చూపి, పతకాలు సాధించిన యాతం నాగబాబును జిలా వైద్యారోగ్య శాఖాధికారి జె.నరసింహ నాయక్ సోమవారం అభినందించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో నాగబాబు డీఎంహెచ్ఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ, జిల్లా మలేరియా విభాగంలో సబ్ యూనిట్ అధికారిగా పనిచేస్తున్న అథ్లెట్ నాగబాబు సాధించిన విజయాలు జిల్లాకు గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

నగరానికి చేరిన సైకిల్ యాత్ర



కాకినాడకు చేరుకున్న ముత్తు సెల్వన్

కాకినాడ సిటీ: పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ కోసం తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముత్తు సెల్వన్ ప్రపంచ వ్యాప్తంగా సైకిల్ యాత్ర ప్రారంభించారు. సుమారు 29 వేల కి.మీ. యాత్ర పూర్తి చేసుకుని సోమవారం కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకున్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కార్పొరేషన్ కమిషనర్ భావన సోమవారం తెల్లవారుజామున పలు ప్రాంతాల్లో పర్యటించారు. కరణంగారి సెంటర్, కమల్‌వీర్ థియేటర్ పరిసర ప్రాంతాలు, స్టేడియం రోడ్డు, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైన్ల పరిశుభ్రత, ఇంటింటా చెత్త సేకరణ తదితర విషయాలపై ఆరా తీశారు. పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆమె వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, ఉన్నారు.

కండక్టర్లకు ప్రశంసా పత్రాలు

కాకినాడ సిటీ: ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ ఈడీ జి.విజయరత్నం సోమవారం కాకినాడ డిపోను సందర్శించారు. గ్యారేజ్‌లో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన కండక్టర్లు ఎంఎస్ రావు, జి.త్రిమూర్తులు, ఎండీఏ ఖాన్‌కు ప్రశంసా పత్రాలు అందజేశారు. జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు, డిపో మేనేజర్ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



విజయరాయుడుపాలెంలో నీరందక ఆరిపోయిన వరి పొలం వద్ద రైతు



నూనెగుంట కాలువలో తూముకు దిగువనున్న నీటమట్టం



పెద్దాపురప్పాడులో నీరులేక ఆరిపోయిన పొలం



విజయరాయుడుపాలెంలో ఆరిపోయిన వరి దుబ్బును చూపుతున్న రైతులు

నేల తడారి.. చేలు ఎడారి

- రబీలో సాగు నీరందక రైతుల గగ్గోలు
- పంట కాలువల్లో అడుగంటిన జలాలు
- 6 వేల ఎకరాల్లో ఆరిపోతున్న పొలాలు
- తోడుకోవడానికి ఎకరానికి రూ.2 వేల అదనపు ఖర్చు
- పాలకుల తీరుపై రైతుల ఆగ్రహం



కరపలో సాగు నీరందక గుల్లతో తోడుకుంటున్న రైతు

కరప: ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామంటూ కూటమి నేతలు చేసిన ప్రకటనలు కేవలం ప్రచార ఆర్భాటాలేనని అన్నదాతలు మండిపడుతున్నారు. ప్రస్తుత సీజన్‌లో పొలాల్లో నీరు కానరాకపోవడమే ఇందుకు నిదర్శనమని విమర్శిస్తున్నారు. రబీ పంటకు కీలకమైన ప్రస్తుత తరుణంలో సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేయింబవళ్లు కాలువల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా చుక్క నీరు రావడం లేదని వారు గగ్గోలు పెడుతున్నారు. వాతావరణం అనుకూలంగా ఉండి, దాళ్వా దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయనుకుంటున్న ఈ తరుణంలో సాగునీటి సమస్య వచ్చి పడిందని రైతులు వాపోతున్నారు. కాలువ శివారు భూములకు తోడుకోవడానికి కూడా నీరందడం లేదంటున్నారు. సాగునీటికి నానా అవస్థలు పడుతుంటే పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై రైతులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

కాలువలకు అందని నీరు

వంతుల వారీ విధానం అమలు చేస్తున్నా నీరందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు వారాలకు ఓ వంతు రావాల్సి ఉండగా, మూడు వారాలు పైబడినా రావడం లేదని పెదవి విరుస్తున్నారు. ఇదెక్కడి వంతుల వారీ విధానమని విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, కరప రైతులు మండిపడుతున్నారు. మండలంలోని సుమారు 14 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు. సాగు భూములన్నీ పంట కాలువలకు శివారున, మెరక భూములుగా ఉంటాయి. వారం, పది రోజులుగా కాలువలకు సక్రమంగా నీరు రావడం లేదని రైతులు అంటున్నారు. వెల్ల నార్త్ కెనాల్, సంపర బోది, న్యూభీమన్న కర్ర కాలువ, రావువారి కాలువ, గరువు కాలువ పరిధిలో శివారు ప్రాంతాలైన విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు, గొడ్డటిపాలెం, జెడ్.భావారం, కొరిపల్లి, కరప, గురజానాపల్లి తదితర గ్రామాలకు చెందిన సుమారు 6 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందడం లేదని రైతులు చెబుతున్నారు. ఆయా గ్రామాల్లోని కాలువలకు నీరు రాకపోవడంతో వరి చేలు ఆరిపోతున్నాయని రైతులు తెలిపారు. విజయరాయుడుపాలెంలో పరిస్థితి మరీ దారుణంగా ఉందని గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

దిగుబడులపై ప్రభావం

వరిచేలు పిలకలు తొడిగి, దుబ్బు చేస్తున్నాయని, ఇప్పుడే సాగు నీరు అవసరమని అంటున్నారు. వంతుల విధానం అమలు చేస్తున్నా చేలు తడవటం లేదంటున్నారు. ఈ సమయంలో నీరందకపోతే దిగుబడులు తగ్గిపోయే అవకాశముందని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి పొలాలకు పూర్తి స్థాయిలో సాగు నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అరకొరగా వస్తున్న నీటిని ఇంజిన్లతో తోడిస్తుంటే రూ.2 వేలు ఖర్చవుతోందని చెబుతున్నారు. గతంలో ఇచ్చినట్టుగా డీజిల్ సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డీజిల్ ఇచ్చి ఆదుకోవాలి



సాగు నీరందక వరిచేలు ఎండిపోతున్నాయి. వంతుల విధానం అంటున్నారే కానీ, సక్రమంగా అమలు చేయడం లేదు. రెండు వారాలకు రావాల్సిన వంతు మూడు వారాలు పైబడినా ఇవ్వడం లేదు. నిద్ర మానుకుని కాలువ గట్లపై తిరుగుతున్నా పొలాలు తడవటం లేదు. నీటి మట్టం పెంచి మెరక భూములు, శివారు భూములు తడిపేందుకు చర్యలు తీసుకోవాలి. వెదజల్లిన పొలం దెబ్బ తినకుండా ఉండాలంటే, నీటి తడి అవసరం. పొలం తడిచి 20 రోజులైంది. ఆయిల్ ఇంజిన్‌తో తోడుకోవడానికి ఎకరానికి రూ.2 వేలు అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రైతులకు డీజిల్ ఇచ్చి ఆదుకోవాలి.

– ఎర్రంనీడి వెంకటరమణ, రైతు, కరప

వంతు ఎప్పుడొస్తుందో..!

విజయరాయుడుపాలెంలో పిల్ల కాలువ, నూనెగుంట కాలువల పరిధిలో సుమారు 800 ఎకరాలుంటాయి. ఈ పొలాలకు రెండు వారాలైనా వంతు రాలేదన్నారు. కనీసం తోడుకోవడానికైె నీరు రావడం లేదంటున్నారు. మూడు రోజుల క్రితం అధికారులు వచ్చి, కాలువలు చూసి వెళ్లారే కానీ, కాలువల్లోకి నీరు రావడం లేదని రైతులు ఆరోపించారు. కరపలోని న్యూభీమన్న కర్ర కాలువ పరిధిలో శివారు భూములకు సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొగలోని రైతులు ఇంజిన్లతో తోడుకుంటుంటే, ఆక్వా సాగుదారులు కూడా పంట కాలువలో ఇంజిన్లుపెట్టి తోడేస్తున్నారని, దీంతో కిందకు చుక్కనీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రేయింబవళ్లు తిరుగుతుంటే గుల్లతో తోడుకుంటున్నామని శివారు రైతులు తెలిపారు.

చేలు ఆరిపోతున్నాయి



నూనెగుంట కాలువ పరిధిలో ఎప్పుడూ సాగునీటి ఎద్దడి రాలేదు. ఈ ఏడాది సాగు నీటి కోసం అష్టకష్టాలు పడుతున్నాం. సాగు నీరందక వరి చేలు ఆరిపోయి, నెర్రలు తీస్తున్నాయి. అధికారులు వస్తే ఆరిపోయిన పొలాలను చూపించాం. రెండు రోజుల్లో కాలువలకు పూర్తిగా నీరు వదులుతామన్నారు. చుక్క నీరు కూడా పెరగలేదు. 5 ఎకరాలు సాగు చేస్తున్నాను. ఇప్పటికే ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టాం. అధికారులు స్పందించి సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలి.

– నందికోళ్ల సత్యారావు, కౌలు రైతు, విజయరాయుడుపాలెం

వ్యవసాయం చేయలేం



ఆరు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. మూడు సార్లు ఎరువులు వేశాను. రెండు సార్లు పురుగు మందులు పిచికారీ చేశాను. చేను పిలకలు తొడిగి, దుబ్బు చేస్తున్న సమయంలో సాగు నీరందక చేను ఎదగడం లేదు. సాగునీటి సమస్య ఇలాగే ఉంటే వ్యవసాయం చేయలేం. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనబడటం లేదు. పాలకులు ఆదుకోకపోతే రైతులకు కష్టాలు తప్పవు.

– చీకట్ల సూర్యనారాయణ, కౌలు రైతు, విజయరాయుడుపాలెం

గుల్లతో తోడుకుంటున్నాం



న్యూభీమన్న కర్ర కాలువకు సక్రమంగా సాగు నీరందక పొలాలు ఎండిపోతున్నాయి. రేయింబవళ్లు కాలువలపై తిరుగుతున్నా పని జరగడం లేదు. తోడుకుందామన్నా నీరు రావడం లేదు. కొద్దిపాటి చుక్కలు వస్తుంటే గుల్లతో తోడుకుంటున్నాం. అధికారులు స్పందించి శివారు భూములకు సాగు నీరందేలా చర్యలు తీసుకోవాలి.

– పుణ్యమంతుల చినఅప్పారావు, రైతు, కరప

బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

డీఐఓ డాక్టర్ సుబ్బరాజులు

కరప: ఆరోగ్య పరిరక్షణకు ఏడాది చిన్నారుల నుంచి 19 ఏళ్ల బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుబ్బరాజులు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. కరప పీహెచ్‌సీ డాక్టర్ ఏంజలిన్ మాట్లాడుతూ, పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు 7,280 మందిని గుర్తించామని చెప్పారు. వీరికి ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్లు, హెల్త్ అసిస్టెంట్లు ఉపాధ్యాయులతో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్టు తెలిపారు.

వేళంగి పీహెచ్‌సీ పరిధిలో చిన్నారులు, విద్యార్థులు 4,031 మందికి ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్టు డాక్టర్ ఎంకే సౌజన్య, డాక్టర్ ఆర్.శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. పెనుగుదురు పాఠశాలలో ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి, వైద్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు మాత్రలు మింగించారు.



కరప హైస్కూలులో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న డీఐఓ డాక్టర్ సుబ్బరాజులు



పెనుగుదురు పాఠశాలలో విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న ఎంఈఓ బుల్లికృష్ణవేణి



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కాకినాడ రూరల్: డీ వార్మింగ్ డే సందర్భంగా కాకినాడ ఐడీఏ, అడబాల ట్రస్ట్ సంయుక్తాధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను సోమవారం పంపిణీ చేశారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టరు అడ్డాల మాట్లాడుతూ, నులి పురుగుల నిర్మూలనతో పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, డాక్టర్ యేరూష, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రౌడీల బారి నుంచి రక్షించండి

జేసీని ఆశ్రయించిన దంపతులు



కలెక్టరేట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న వీరబాబు, అశ్వని దంపతులు

కాకినాడ సిటీ: తాము ఉంటున్న ఇంటిని ఖాళీ చేయాలని, లేకపోతే చంపేస్తామని బెదిరిస్తున్న రౌడీల నుంచి రక్షణ కల్పించాలంటూ కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామానికి చెందిన చెల్లుబోయిన వీరబాబు, అతడి భార్య అశ్వని సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు దంపతులు విలేకర్లకు వివరాలు తెలిపారు. తాము ఏడేళ్ల నుంచి ఇంద్రపాలెంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నామన్నారు. ఆ ఇంటిని యజమాని విక్రయిస్తున్నాడని తెలియడంతో, దానిని కొనుగోలు చేసేందుకు ఆరు నెలల కిందట రూ.15 లక్షలు ఇచ్చి ఒప్పంద పత్రం రాయించుకున్నామన్నారు. తమకు తెలియకుండా ఆ యజమాని కాకినాడ రూరల్ మండలం స్వామినగర్‌కు చెందిన వ్యక్తులకు ఇంటిని విక్రయించారన్నారు. ఇల్లు కొనుగోలు చేశామంటున్న వ్యక్తులు కొందరు రౌడీలను తీసుకొచ్చి ఇల్లు ఖాళీ చేయాలంటూ తమపై బెదిరింపులకు దిగారని, దీనిపై కాకినాడ కోర్టులో కేసు వేశామని తెలిపారు. అప్పటి నుంచి తమపై వివిధ రకాలుగా వేధింపులకు దిగుతున్నారని ఆరోపించారు. రౌడీల నుంచి రక్షణ కల్పించి, వారిని ఉసిగొల్పుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జేసీని కోరినట్లు వీరబాబు దంపతులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులతో విచారణ జరిపిస్తామని జేసీ భరోసా ఇచ్చినట్టు చెప్పారు.

ఎన్నికల కోడ్ ఎక్కడ..?

కరప: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినా.. ఎన్నికల కోడ్ అమలవుతున్న దాఖలాలు కానరావడం లేదు. కరప మండలంలో అధికారులు కోడ్ అమలులో చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, నాయకులు తమకు అనుకూలంగా ఉండే అధికారులను బదిలీ చేయించుకున్నారు. దానికి ప్రతిఫలంగా అధికారులు ఎన్నికల కోడ్‌ను అమలు చేయకుండా స్వామిభక్తిని చాటుకుంటున్నారు. పెద్దాపురప్పాడు గ్రామంలో ముఖద్వారం వద్ద పీఎం, సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, నాయకుల ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీని తొలగించకుండా వదిలేశారు. డిప్యూటీ సీఎం నిలువెత్తు కటౌట్‌కు అసంపూర్తిగా ముసుగు వేశారు. అధికారుల తీరుపై ఆయా ప్రాంతాల ప్రజలు చర్చించుకుంటున్నారు.



పెద్దాపురప్పాడులో ముఖద్వారం వద్ద ఫ్లెక్సీ

నాయకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

కాకినాడ సిటీ: మహా దాత, విద్యా ప్రదాత మల్లాడి సత్యలింగం నాయకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు కోరారు. సోమవారం కాకినాడ రూరల్ మండలం తూరంగి డ్రైవర్స్‌కాలనీలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తిరుమాని కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని, మల్లాడి సత్యలింగం నాయకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పంపన రామకృష్ణ, బీసీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, అద్దంకి వీరబాబు, తిరుమాని కుమార్‌స్వామి మాట్లాడుతూ, నాయకర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరికిన పెద్దరాజు, పి గోవిందు, శాండీ, కాటాడి ఏడుకొండలు, సూరిబాబు, కర్రి గంగాచలం తదితరులు పాల్గొన్నారు.

నాయకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

కాకినాడ రూరల్: భారతీయ సమాజానికి వెలకట్టలేని సేవలు అందించిన మహోన్నత దాత, విద్యోద్యమ నిర్మాత మల్లాడి సత్యలింగం నాయకర్ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన వర్ధంతిని స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యాంపస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.కమలకుమారి అధ్యక్షత వహించారు. ఎంఎస్ఎన్ చారిటీస్ ట్రస్ట్ చైర్మన్ మల్లాడి కార్తిక్ నాయకర్ ముఖ్యఅతిథిగా, కాకినాడ ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కమలకుమారి మాట్లాడుతూ, నాయకర్ జీవిత మార్గం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, సమాజ సేవలో ముందుండాలన్నారు. మూడు దశాబ్దాల క్రితం నాయకర్ లైఫ్ సైజ్ పెయింటింగ్‌ను డీసీఎంఎస్ అధ్యాపకులు మనోజ్ దేవ పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ప్రశాంతిశ్రీ, కర్రి రామారావు, పి.విజయ్ కుమార్, డాక్టర్ ఎం పోచయ్య, రాధామాధవి, మహమ్మద్ నదీమ్, శ్రీరామరాజు, నానిబాబు, స్టీఫెన్, సూరిబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



నాయకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల ప్రతినిధులు



నాయకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

రక్తదాతలను ప్రోత్సహించాలి

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ రక్తదాతలను ప్రోత్సహించాలని ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ(కేసీబీఎస్) అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి అన్నారు. కేసీబీఎస్ మాజీ అధ్యక్షుడు దివంగత కోసూరి యదుసూర్య జయంతి సందర్భంగా స్థానిక సూర్యారావుపేటలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. తొలుత సంస్థ వ్యవస్థాపకుడు కోసూరి కృష్ణారావు, కోసూరి ఎదుసూర్య విగ్రహాలకు పాలకవర్గ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటైన ఈ శిబిరంలో సంస్థ ఉద్యోగులు, సభ్యులు, ఖాతాదారులు పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ, రక్తదానం ప్రాణాపాయంలో ఉన్న వారికి ప్రాణదానం వంటిదన్నారు. ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్రకుమార్ మాట్లాడుతూ, సంస్థ కార్యకలాపాలతో పాటు, సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మేనేజర్ చీమలకొండ గంగాధరం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సంస్థ కార్యదర్శి ముమ్మిడి గోవిందు, డైరెక్టర్లు కోసూరి లక్ష్మీపసాద లావణ్య, ఒబిలిశెట్టి బుచ్చిరాజు శివ బాలయోగి పాల్గొన్నారు.

ఘనంగా అలుకుల సంబరం



బుగ్గలకు అలుకులు గుచ్చుకుని ట్రాక్టర్‌పై ఊరేగుతున్న భక్తులు

కరప: గొర్రిపూడి గ్రామంలో సోమవారం అలుకుల సంబరం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని కరికాల భక్తులు ఈ సంబరాన్ని ఐదు దశాబ్దాలుగా చేస్తున్నారు. ఏటా మాఘ మాసంలో వచ్చే భీష్మ ఏకాదశి రోజున బసవేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తారు. తరువాత ఐదు రోజుల పాటు వివిధ రకాల పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఇందులో భాగంగా మూడో రోజు కొంతమంది కరికాల భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు గోదావరి పాయ ప్రవహించే కేఎంజే కాలువలో స్నానమాచరించారు. బసవేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి, శూలాలను బుగ్గలకు గుచ్చుకుని, ట్రాక్టర్‌పై గ్రామంలో ఊరేగారు. బుధవారం రాత్రి ఆలయంలో పార్వతీ, పరమేశ్వరుల సంబరాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అదే రోజు సాయంత్రం భక్తులు నిప్పుల గుండం తొక్కడం పరిపాటి. నందిని ఎత్తుకుని నిప్పుల గుండం తొక్కితే సంతానం కలుగుతుందని గ్రామస్తుల విశ్వాసం. గొర్రిపూడి, పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త చప్పిడి నవీన్, గ్రామ పెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో చుట్టోత్సవం

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో సోమవారం సాయంత్రం చుట్టోత్సవం(దేవాలయ ప్రదక్షిణ ఉత్సవం) భక్తి,శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. వేంకటేశ్వర స్వామివారి దివ్య కల్యాణోత్సవంలో భాగంగా మూడో రోజు వేంకటేశ్వరస్వామి, సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవిని వంశపారంపర్య అర్చకుడు పెద్దింటి సీతారామం ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఈఓ ఏఆర్వీ అపర్ణ, కె.రఘు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాకినాడ వారి మహిళా కోలాటం, చిన్నారుల భరతనాట్యం అలరించాయి.

ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర

కాకినాడ సిటీ: ఎస్సీ వర్గీకరణ రాజకీయ కుట్ర మాత్రమేనని, అధికార పార్టీలు వెనక్కి తగ్గకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని రాక్స్ (కుట్రపూరిత ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక గర్జన) మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్ రత్నాకర్ అన్నారు. కాకినాడలో సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ, వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని, అధికార పార్టీలు వెనక్కి తగ్గకపోతే తగు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కేంద్ర వైఖరి సక్రమంగా లేదని విమర్శించారు.

దాడి కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: ఇద్దరిపై దాడి చేసిన కేసులో నిందితుడికి ఏడాది జైలు, రూ.2 వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలా శ్యామ్ సుందరి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, పెదపూడి మండలం సంపర గ్రామానికి చెందిన కేత నాగబాబు 2023లో అదే ప్రాంతానికి చెందిన వాసంశెట్టి రాంబాబు, వాసంశెట్టి లక్ష్మిపై దాడి చేశాడు. పెదపూడి పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టులో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.